క్లుప్తంగా

చల్లబడిన వాతావరణంతో ఉపశమనం

కడియం: ఉక్కపోతతో నెల రోజులుగా ఇబ్బంది పడుతున్న ప్రజలకు చల్లబడిన వాతావరణం ఉపశమనం కల్పించింది. మూడు రోజులుగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏదో ఒక సమయంలో వర్షం పడుతోంది. వరుణ దేవుడు కరుణించడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. రాత్రి పూట సైతం తీవ్ర ఉక్కపోతల కారణంగా ఇబ్బందులు పడ్డ పరిస్థితి నుంచి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ముఖ్యంగా మండలంలో విస్తరించి ఉన్న నర్సరీల్లో మొక్కలను వేసవితాపం నుంచి కాపాడుకునేందుకు రైతులు చాలా అవస్థలు పడ్డారు. అవిసె మొక్కలు, షేడ్‌నెట్ల సాయంతో మొక్కలను కాపాడుకునేందుకు సమాయత్తమయ్యారు. అయితే వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మండలంలో వరి కోతలు నూరు శాతం పూర్తయ్యాయని వ్యవసాయశాఖ సిబ్బంది తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా పంట దెబ్బతినే పరిస్థితులు లేవని తెలిపారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు

కంబాలచెరువు: సోషియల్ ఇన్క్యుబేషన్‌లో భాగంగా సెంట్రల్ జైలులో ఖైదీల మానసిక పరివర్తనపై శుక్రవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మెడికల్ కాలేజ్ సైక్రియాటిస్ట్‌లు డాక్టర్ రామరెడ్డి, డాక్టర్ నీలిమ మాట్లాడుతూ తెలిసీ, తెలియక మత్తు పదార్థాలకు బానిసలై, నేరాలకు పాల్పడి కారాగారానికి వస్తున్నారన్నారు. ఆ వ్యసనాలు మానుకొని పరివర్తన చెంది, సమాజంలో గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ఏదైనా పని చేసేటపుడు మంచి చెడులను తోటివారితో చర్చించి, మంచి నిర్ణయం తీసుకోవాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్, డాక్టర్ పీతాని కోమలి, డాక్టర్ హారిక, కారాగార డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.రాజకుమార్, జైలర్లు పాల్గొన్నారు.

ముగిసిన చిన్నారుల వేసవి శిక్షణ తరగతులు


ముగింపు కార్యక్రమంలో బైబిల్ శిక్షణకు హాజరైన చిన్నారులు

నల్లజర్ల: మండలంలోని చీపురుగూడెంలో సంపూర్ణ సువార్త ఆలయంలో పాస్టర్ ఎస్.విజయబాబు ఆధ్వర్యంలో చిన్నారులకు మూడు రోజుల పాటు నిర్వహించిన వేసవి బైబిల్ శిక్షణ తరగతులు శుక్రవారంలో ముగిశాయి.అనంతపల్లి నుంచి వచ్చిన సిస్టర్ జెస్సికా బృందం చిన్నారులకు బైబిల్ కథలు, వాక్యాలు, నృత్యాలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ చిన్నారులకు వేసవిలో అధ్యాత్మిక, నైతిక విలువలు పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

ఇసుక ర్యాంపుల్లో రెండో రోజూ దాడులు

పెరవలి: మండలంలోని తీపర్రు, పెండ్యాల, మల్లేశ్వరం, పందలపర్రు ర్యాంపుల్లో మైనింగ్, విజిలెన్స్ అధికారులు శుక్రవారం కూడా దాడులు కొనసాగించారు. దీంతో ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. తీపర్రు ఇసుక ర్యాంపులో గురువారం రెండు పొక్లెయిన్లు, రెండు లారీలు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. రెండు రోజుల దాడుల అనంతరం మొత్తం 5 పొక్లెయిన్లు, 4 లారీలు స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేసి, జరిమానా విధించామని అధికారులు తెలిపారు. తీపర్రు ర్యాంప్‌లో లారీలకు ఎటువంటి మైనింగ్ బిల్లులూ ఇవ్వకుండా నెల రోజులుగా ఇసుక తరలించారని, ఈ నేపథ్యంలోనే ఈ దాడులు నిర్వహిస్తున్నామని మైనింగ్ ఏడీ సుబ్రహ్మణ్యం తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య

- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో పేద విద్యార్థులకు మేలు
- 25 శాతం సీట్లు కేటాయింపు
- కొవ్వూరు డివిజన్‌లో 665 మందికి లబ్ధి


నిడదవోలు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులు (ఫైల్)

నిడదవోలు రూరల్: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో పేద విద్యార్థుల ప్రవేశానికి రంగం సిద్ధమైంది. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం పేద పిల్లలకు 2024–25 విద్యా సంవత్సరంలో ఉచిత అడ్మిషన్లు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో విద్యాశాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించి కొవ్వూరు డివిజన్ పరిధిలో 665 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. మిగిలిన పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడి నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఉన్నత చదువులే లక్ష్యంగా..

విజ్ఞానంతోనే పేదల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచవచ్చు అనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారు. ఓ వైపు నాడు–నేడు పథకంలో భాగంగా సర్కారు బడులను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నారు. మరోవైపు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో సమీప ప్రాంతాల పేద విద్యార్థులు ఉచితంగా చదువుకునే అవకాశాన్ని గతేడాది ప్రభుత్వం కల్పించింది. ఈ మేరకు విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాలనే నిబంధనలను పక్కాగా అమలు చేస్తోంది. ఐబీ, ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్‌లు అమలవుతున్న ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలలు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. దీంతో నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల్లో 537 ప్రైవేటు, కార్పొరేట్, ఎయిడెడ్, ప్రైమరీ పాఠశాలలు ఉండగా వాటి పరిధిలో సుమారు 4 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. మొదటి విడతలో మంది 665 విద్యార్థులను ఎంపిక చేశారు.

పారదర్శకతకు పెద్దపీట

అన్నివర్గాల పేద పిల్లలు ఒకటో తరగతి ప్రైవేటు లేదా కార్పొరేట్ పాఠశాలల్లో ప్రభుత్వ వ్యయంతో అభ్యసించే అవకాశాన్ని సర్కారు కల్పించింది. ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం 12(1) (సి) అమలులో భాగంగా ప్రతి పాఠశాలలోను 25 శాతం సీట్లు కేటాయించాలి. రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా చేపట్టింది. దరఖాస్తు మొదలు ఎంపిక వరకూ అంతా ఆన్‌లైన్‌లోనే చేపట్టిన ప్రభుత్వం ఈ పథకం అమల్లో పారదర్శకతకు పెద్దపీట వేసింది.

సీట్ల కేటాయింపు, ఫీజుల చెల్లింపు ఇలా...

ప్రతి ప్రైవేట్ పాఠశాలల్లో యాజమాన్యాలు అనాథ, దివ్యాంగ, హెచ్ఐవీ బాధితుల పిల్లలకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బలహీన వర్గాల పిల్లలకు 6 శాతం మొత్తం 25 శాతం సీట్లను కేటాయించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు 6–14 ఏళ్ల లోపు పిల్లల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షలు ఉండాలి. అర్బన్ పరిధిలోని పాఠశాలలో ఒక్కో అడ్మిషన్‌కు రూ.8 వేలు, రూరల్ పరిధిలోని అడ్మిషన్‌కు రూ.6,500 గా నిర్ణయించింది. ఈ మొత్తాన్ని ప్రభుత్వమే ఆయా పాఠశాలలకు చెల్లిస్తుంది. అయితే మన రాష్ట్రంలో అమ్మఒడి పథకం ద్వారా ఏటా ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు అందజేస్తోంది. ప్రైవేట్ పాఠశాలలకు ఎంపికైన విద్యార్థులకు అమ్మఒడి డబ్బుతోనే ఫీజు చెల్లిస్తారు. మిగిలిన సొమ్మును, విద్యార్థి తల్లి లేదా సంరక్షకుల ఖాతాలో జమ చేస్తారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం ప్రకటించింది.

డివిజన్ పరిధిలో తొలి విడతలో ఎంపికైన విద్యార్థులు

మండలం	ఎంపికైన విద్యార్థులు
నిడదవోలు	113
పెరవలి	39
ఉండ్రాజవరం	38
కొవ్వూరు	148
చాగల్లు	55
తాళ్లపూడి	50
గోపాలపురం	47
దేవరపల్లి	92
నల్లజర్ల	83
మొత్తం	665

పేదలకు ఉన్నత విద్య




నా భర్త వెంకట్రావు ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ మా కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మా అబ్బాయి భువేష్‌ను ప్రైవేటు పాఠశాలలో చేర్పించాలంటే అంత ఫీజులు కట్టలేం. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలల్లో పేదలకు ఉచితంగా ప్రవేశాలు కల్పించడంతో దరఖాస్తు చేశాను. సమిశ్రగూడెం విజ్ఞాన్ స్కూల్‌లో సీటు వచ్చింది. పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయం.

–ఉండ్రాజవరపు సులోచనరాణి, సమిశ్రగూడెం

సద్వినియోగం చేసుకోవాలి



ప్రతి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ ఆధారంగా పేద పిల్లలకు 25 శాతం సీట్లు కేటాయిస్తాం. ఎంపికైన విద్యార్థులను చేర్చుకోబోమని చెప్పినా, అడ్మిషన్లు తిరస్కరించినా, ఫీజు చెల్లించాలని వేధించినా నిబంధనల మేరకు సంబంధిత పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటాం.ఈ అవకాశాన్ని పేద విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి.

– కేఎన్‌వీ గణేష్, ఎంఈఓ, నిడదవోలు

దొమ్మేరులో విద్యార్థుల వన మహోత్సవం


మొక్క నాటుతున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ డాక్టర్ రమణమూర్తి

కొవ్వూరు: రాజమహేంద్రవరానికి చెందిన ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ (జాతీయ సేవా పథకం) విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం దొమ్మేరు గ్రామంలో వన మహోత్సవం నిర్వహించారు. దొమ్మేరు గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాల భవనాల ప్రాంగణాల్లో ఆ విశ్వవిద్యాలయం విద్యార్థులు, సిబ్బంది వేప, ఉసిరి, నిమ్మ, కొబ్బరి, జామ వంటి మొక్కలు నాటారు. దొమ్మేరు గ్రామంలో ఏడు రోజులు పాటు ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆ యూనివర్సిటీ అసోసియేట్ డీన్ డాక్టర్ కేవీ రమణమూర్తి తెలిపారు. ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ కేఎం దక్షిణా మూర్తి, డాక్టర్ సీహెచ్ సునీత, ప్రొఫెసర్స్ కె.రవికుమార్, దొమ్మేరు సర్పంచ్ తానేటి కుమారి, సొసైటీ అధ్యక్షుడు ముదునూరి సూర్యనారాయణ రాజు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆది శంకరాచార్య జయంతి వేడుకలు

దేవరపల్లి: ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. దేవరపల్లిలోని ఆదిశంకరాచార్య జ్ఞాన మందిరంలో నాలుగు రోజుల పాటు విశేష పూజలు నిర్వహించారు. ముగింపు సందర్భంగా మందిరం వద్ద కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిగింది. దేవరపల్లి, పరిసర గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరై అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

హై బీపీని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు

- డాక్టరు తెల్లం గంగాధరరావు
- ప్రపంచ రక్తపోటు దినోత్సవం


రక్తపోటు నియంత్రణలో ఉంచుకుంటామంటూ నల్లజర్ల పీహెచ్‌సీ వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

నల్లజర్ల: హై బీపీని నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికే ప్రమాదమని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ తెల్లం గంగాధరరావు హెచ్చరించారు. శుక్రవారం ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజలకు ఆయన పలు సూచనలు చేశారు. తలనొప్పి, తల తిరగడం, మెడ నరాలు లాగేస్తున్నట్టు ఉండడం, కళ్లు తిరగం, ఆకస్మికంగా తూలిపోవడం, తరచుగా తలపోటు రావడం, ఒళ్లంతా చెమటలు పట్టడం, యూరిన్ తక్కువగా రావడం, కాళ్లు తిమ్మిర్లుగా ఉండడం రక్తపోటు లక్షణాలని ఆయన వివరించారు. హై బీపీతో బాధపడే వారు ఆహారంలో ఉప్పు శాతాన్ని బాగా తగ్గించాలన్నారు. మసాలాలు, నిల్వ పచ్చళ్లు, కారం తగ్గించాలన్నారు. రోజూ గంటసేపు వ్యాయామం, యోగా చేస్తూ, మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలు, ఆల్కహాల్, సిగరెట్ వంటి అలవాట్లు ఉంటే మానుకోవాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చిన వారందరికీ బీపీ చెక్ చేశారు. అనంతరం బీపీని అదుపులో ఉంచుకుందాం అంటూ వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ పలివెల ప్రసాదరావు, సూపర్‌వైజర్ అన్నమ్మ, సత్యనారాయణ, వైద్య ఉద్యోగులు పాల్గొన్నారు.

రావిమెట్లలో 383 మందికి వైద్య పరీక్షలు

నిడదవోలు రూరల్: మండలంలోని రావిమెట్ల గ్రామంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సమిశ్రగూడెం పీహెచ్‌సీ వైద్యుడు ఎం.శివాజీ ఆధ్వర్యంలో 383 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. పీహెచ్‌సీ సిబ్బంది, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాలక్ష్మమ్మ మహోత్సవాలు ప్రారంభం


మహాలక్ష్మమ్మ వారు

చాగల్లు: స్థానిక మహాలక్ష్మమ్మ వారి వార్షిక పూజా మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఐదు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. వేద పండితుడు జి.సుబ్రహ్మణ్యశర్మ, పండిత, పురోహితుల వేద మంత్రాల మధ్య అమ్మవారి మహోత్సవానికి కలశ స్థాపన, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, సమస్త దేవత ఆవాహన, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. శుక్రవారం సాయంత్రం కోలాటం, చాగల్లు వారిచే భజన కాలక్షేపం జరిగాయి. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


బ్రాహ్మణగూడెంలో స్వామి వారిని రథంపై ఊరేగిస్తున్న భక్తులు

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సాలు

చాగల్లు: బ్రాహ్మణగూడెంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధన మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారికి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై స్వామి వారిని ఉంచి, డప్పు వాయిద్యాలతో పుర వీధుల్లో ఊరేగించారు. స్వామి వారిని సుందరంగా అలంకరించారు. పూజలు,అభిషేకాలు చేశారు.

ముందుగా నవధాన్యాలు సాగు చేయండి


ప్రకృతి వ్యవసాయసిబ్బందికి అవగాహన కార్యక్రమం

నల్లజర్ల: సేంద్రియ సాగుకు శ్రీకారం చుట్టే రైతులందరూ ముందుగా నేలకు బలం చేకూర్చేలా నవధాన్యాల సాగు చేయాలని సీఎంఎఫ్ మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ రైతులకు సూచించారు. నల్లజర్ల రైతు భరోసా కేంద్రం వద్ద శుక్రవారం సేంద్రియ సాగుపై ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు చేసే పొలంలో 45 రోజుల ముందు నూనెజాతులు, పప్పు ధాన్యాలు, చిరు, తృణ ధాన్యాలు, ఆకుకూరల విత్తనాలు చల్లి పచ్చిరొట్ట ఎరువుగా పెంచాలన్నారు. నీరుపెట్టి ఆయా రకాల మొక్కలన్నింటినీ దమ్ము వీల్స్‌తో తొక్కించి భూమిలో కలియదున్నాలన్నారు. తద్వారా భూమి సారవంతంగా, ఏడాదంతా పచ్చగా ఉంటుందన్నారు. వేరు వ్యవస్థలో బొడిపెల ద్వారా భూమికి పోషకాలు అందుతాయని చెప్పారు. ప్రధాన పంటకు కావాల్సిన నత్రజని, భాస్వరం, పొటాష్‌లతో పాటు అన్నిరకాల పోషకాలు భూమి స్వయంగా వృద్ధి చేసుకుంటందన్నారు. రైతులకు పశుగ్రాసంతో పాటు ఆకుకూరలు కూడా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా మేనేజరు తాతారావు, అడిషనల్ మేనేజరు వల్లి, ప్రాజెక్ట్ జూనియర్ ఎగ్జిక్యూటివ్ వరలక్ష్మి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

దేవరపల్లి: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి బి.తాతారావు అన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శుక్రవారం దేవరపల్లి ఆర్‌బీకే –3 వద్ద అవగాహన కల్పించారు. ఖరీఫ్ సీజన్‌కు అనుకూలంగా వర్షం కురవడంతో మెట్ట రైతులు నవధాన్యాలు, పచ్చిరొట్ట ఎరువులు వేయాలని రైతులకు సూచించారు. రసాయన ఎరువుల ఉపయోగించడం వల్ల భూసారం తగ్గిపోతుందన్నారు. అందువల్ల పచ్చి రొట్ట ఎరువులు పండించి ప్రధాన పంట వేసే ముందు భూమిలో కలియ దున్నడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ మేనేజర్ ఎస్‌కే వల్లీ, వరలక్ష్మి, మాస్టర్ ట్రైనర్ కె. శ్రీనివాస్ దేవరపల్లి, నల్లజర్ల, గోపాలపురం ప్రకృతి వ్యవశాయ సిబ్బంది పాల్గొన్నారు.

కేసులను సత్వరమే పరిష్కరించాలి


సమావేశంలో పాల్గొన్న డీఎల్ఎస్‌ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు, జడ్జి మాధురి

కంబాలచెరువు: జిల్లా న్యాయసేవాధికార కార్యాలయంలో ప్యానల్, డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులకు డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో శుక్రవారం మానటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాశ్‌బాబు, 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.మాధురి పలు అంశాలను వారికి వివరించారు. వివిధ కేసుల్లో ఉచిత న్యాయ సహాయం అందించేందుకు నియమించిన న్యాయవాదులతో ఆయా కేసుల పురోగతిపై ఆరా తీశారు. కేసులను సత్వరం పరిష్కరించాలని, దీనికి సంబంధించి ఎటువంటి సమస్యలున్నా వెంటనే జిల్లా న్యాయసేవాధికారసంస్థకు తెలియజేయాలని సూచించారు. క్రిమినల్ కేసులకు సంబంధించి బెయిల్ పిటీషన్లకై వేసిన అర్జీల వివరాలను తెలుసుకున్నారు.

నిర్ణయాత్మక శక్తి మగువే


నిడదవోలు పట్టణంలో ఓటు వేయడానికి బారులు తీరిన మహిళలు (ఫైల్)

- నియోజకవర్గంలో ఓటు వేసిన మహిళలు 91,485 మంది
- ఇది పురుషుల కంటే 3,710 ఎక్కువ
- అభ్యర్థుల విజయంలో కీలకం కానున్న మగువల తీర్పు

నిడదవోలు: ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో అధికంగా మహిళా ఓటర్లే తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మహిళలు ఎటువైపు మొగ్గు చూపారు? వారు ఎవరికి పట్టం కట్టారు? అతివల తీర్పు ఎవరికి అనుకూలం కానుంది? ఏ పార్టీ అభ్యర్థిని చట్టసభకు పంపనున్నారు? ఇప్పుడు నిడదవోలు నియోజకవర్గంలో అందరి మదిలోనూ మెదులుతున్న ప్రశ్నలు ఇవే.. నియోజకవర్గంలో పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్లే అధికం. అంతేకాదు ఓటు హక్కును వినియోగించుకున్న వారిలో సైతం మగువలే ముందంజలో ఉండడం విశేషం. మండుటెండను సైతం లెక్క చేయకుండా ఈనెల 13న నిర్వహించిన పోలింగ్‌లో ప్రారంభం నుంచీ మహిళా ఓటర్లు తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. ఓ వైపు ఈవీఎంలు మొరాయించి ఓటింగ్ ఆలస్యమైనప్పటికీ, మొక్కవోని దీక్షతో క్యూ లైన్‌లో గంటల తరబడి మండుటెండను సైతం లెక్క చేయకుండా నిలబడి తమ ఓటు వేశారు. ప్రజాస్వామ్యంలో తమ పాత్ర ఎంతో కీలకమని తమ ఓటుతో చెప్పకనే చెప్పారు.

నియోజకవర్గంలో..

నియోజకవర్గంలో మొత్తం 2,13,396 మంది ఓటర్లు ఉండగా, వారిలో 1,04, 235 మంది పురుష ఓటర్లు, 1,09, 157 మంది మహిళా ఓటర్లు, నలుగురు ఇతరులు ఉన్నారు. ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 1,80,676 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 89,189 మంది, మహిళలు 91,485 మంది ఉన్నారు. పురుషుల కంటే 3710 మంది మహిళలు అధికంగా ఉన్నారన్నమాట. నియోజకవర్గంలోని నిడదవోలు పట్టణంతోపాటు మూడు మండలాల్లో మహిళా ఓటర్ల అధికంగా ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషం. దీనినిబట్టి చూస్తే మహిళా తీర్పు ఎంత కీలకంగా ఉందో స్పష్టంగా తెలుస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళలకు అందించిన సంక్షేమ పథకాల అభివృద్ధిని చూసి మహిళా ఓటర్లు ఆ పార్టీకి సానుకూలంగా ఉన్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. మహిళలు ఎటువైపు మొగ్గుచూపారో తెలియాలంటే జూన్ 4 వరకూ వేచి చూడాల్సిందే.

మండలాల వారీగా ఓటు హక్కు వినియోగించుకున్న వారి వివరాలు

మండలం	పురుషులు	మహిళలు
నిడదవోలు అర్బన్	13149	14405
నిడదవోలు మండలం	25336	25494
ఉండ్రాజవరం	26034	26603
పెరవలి	24670	24983